# సాక్షి ఖమ్మం

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023






## రాజ్యాంగంతో అందరికీ రక్షణ

రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు రక్షణ లభిస్తోందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు తెలిపారు. 8లో



## మిమ్మల్ని దించడానికి సిద్ధం

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
43° / 24°

## వాతావరణం

జిల్లాలో ఆదివారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఎండకు తోడు పలు ప్రాంతాల్లో వడగాలుల ప్రభావం ఉంటుంది.




## న్యూస్‌రీల్

### శ్రీవారికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తొలుత అర్చకులు శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అలాగే, స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆతర్వాత ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం జరిపించారు. అలాగే, పల్లకీసేవ నిర్వహించగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈఓ జగన్మోహన్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి పాల్గొన్నారు.

### పీఆర్సీ ఇవ్వకపోతే సమ్మె తప్పదు

- విద్యుత్ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ శేషగిరిరావు



సమావేశంలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: విద్యుత్ ఉద్యోగులకు 45శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వనిపక్షంలో ఈనెల 17వ తేదీ నుంచి సంపూర్ణ సమ్మెకు దిగుతామని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ శేషగిరిరావు స్పష్టం చేశారు. సత్తుపల్లి డివిజన్ కార్యాలయం ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన సమ్మె సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం, ఖర్చుతో నిమిత్తం లేకుండా వైద్య సదుపాయం, విధినిర్వహణలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాడమే కాక పదోన్నతులు కల్పించాలనే డిమాండ్‌తో సమ్మెకు దిగనున్నామని చెప్పారు. జేఏసీ జిల్లా కన్వీనర్, డీఈఈ హీరాలాల్‌తో పాటు జేఏసీ బాధ్యులు, ఉద్యోగులు రవికుమార్, సుధాకర్ రెడ్డి, ప్రసాద్, రామకృష్ణ, ముడికా శ్రీను, రమణారెడ్డి, రాములు, డీఎస్‌వీ.ప్రసాద్, ఇస్మాయిల్, శరత్‌బాబు, నరేష్, మానస, అంకారావు, సుజాత, భుజేంద్రకుమార్, శంకర్, జిలాని, రవికిరణ్, రవితేజ, శ్రీనివాసరెడ్డి, ఈ.రామారావు, లక్ష్మీనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

### అటవీ అభివృద్ధి పనులు పరిశీలన



చెక్‌డ్యాం పనులను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి రేంజ్‌లో అటవీ అభివృద్ధి పనులను జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ శనివారం పరిశీలించారు. కిష్టారం, యాతాలకుంట, జగన్నాథపురం, భవన్నపాలెంల్లో జరుగుతున్న చెక్‌డ్యాంలు, వన్యప్రాణుల తాగునీటి అవసరాల కోసం నిర్మిస్తున్న చెరువు కుంటలతో పాటు ప్లాంటేషన్ పనులను ఆయన పరిశీలించి సూచనలు చేశారు. సత్తుపల్లి ఎఫ్‌డీఓ మంజుల, రేంజర్ ఎ.వెంకటేశ్వర్లు, ఎఫ్ఎస్ఓ నర్సింహా, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

### పాల ఉత్పత్తిదారుల సొసైటీలు ఏర్పాటు


ఖమ్మంవ్యవసాయం: గ్రామాల్లో విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఉపసంచాలకులు ఏ.కుమారస్వామి తెలిపారు. ప్రస్తుతం ఉన్న సొసైటీలను పటిష్టపరుస్తూనే కొత్త సంఘాలను ఏర్పాటుచేసి డెయిరీని బలోపేతం చేయనున్నామని వెల్లడించారు. పాడి రైతులకు ముద్రా రుణాల ద్వారా గేదెలు, రాయితీపై మందులు, పశుగ్రాసం విత్తనాలు, వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే, రైతులకు మేలు జరిగేలా పాలమిత్ర మొబైల్ యాప్ ద్వారా నేరుగా నగదు బదిలీ చేస్తున్నామని ఆయన వివరించారు.



ఆకట్టుకుంటున్న ట్యాంక్ బండ్ అందాలు



ఓపెన్ జిమ్



విశ్రాంతి తీసుకునేందుకు హట్

# అందంగా.. కనువిందు చేసేలా!

**ఆకట్టుకునేలా మధిర ట్యాంక్‌బండ్**

- పట్టణ వాసులకు ఆహ్లాదం, ఆరోగ్యం కూడా...
- బోటింగ్‌తో పాటు వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్
- నానాటికీ పెరుగుతున్న సందర్శకులు

సండే స్పెషల్



బోటింగ్ కోసం క్యూలో నిలుచున్న సందర్శకులు

మధిర: సాయంకాలం.. సాగర తీరం అని పాడుకుందామనుకుంటే సముద్రం లేదు. సాయంత్రం కుటుంబంతో సహా సరదాగా గడిపేందుకు ఎక్కడికైనా వెళ్దామంటే ఏ సౌకర్యాలు లేవు.. ఇన్నాళ్లు మధిర వాసుల పరిస్థితి ఇది. కానీ ఇప్పుడు ఆ బాధ లేదు! ఎందుకంటారా... మధిర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5.70 కోట్లతో చెరువు కట్టను సుందరీకరించింది. ట్యాంక్ బండ్, వాకింగ్ ట్రాక్‌లు, బోటింగ్ ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ప్రజలు సేదతీరేందుకు బారులు దీరుతున్నారు. ఈట్యాంక్‌బండ్‌ను కొద్దిరోజుల క్రితమే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించగా నానాటికీ సందర్శకుల సంఖ్య పెరుగుతోంది.

**బోట్ ఎక్కుదామా...**

ట్యాంక్ బండ్ ప్రారంభమైన నాటి నుంచి పట్టణ వాసులు భారీ సంఖ్యలో ఆహ్లాదం కోసం కుటుంబ సభ్యులతో వస్తున్నారు. ఇక్కడ బోటు షికారు కూడా ఉండడంతో యువత, పిల్లలు బారులు దీరుతున్నారు. అలాగే, ట్యాంక్ బండ్‌పై చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్ ఉండడంతో గంటల తరబడి గడిపినా అలిసిపోవడం లేదు. ఇక ఉదయం, సాయంత్రం వాకింగ్ ట్రాక్‌లో అన్నివర్గాల ప్రజలు ఆహ్లాదకరమైన వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని సొంతం చేసుకుంటున్నారు. రంగు రంగుల పూల చెట్లు, విద్యుత్ దీపాలు, విశ్రాంతి తీసుకునేందుకు బల్లలు, హట్స్, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి అన్ని సౌకర్యాలతో ఆకట్టుకుంటోంది. కిలోమీటరున్నర పొడవు కలిగిన ట్యాంక్‌బండ్‌కు ఒకవైపు చెరువు, మరోవైపు పచ్చని పంట పొలాలు ఉండడంతో సాయంత్రం చల్లని గాలులతో సందర్శకులు సేదతీరుతున్నారు. కాగా, చెత్తాచెదారం తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులను నియమించడంతో పాటు తినుబండారాల కోసం స్టాళ్లు కూడా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే, ఆకతాయిల బెడద నుంచి కాపాడేందుకు పోలీసు ఔట్‌పోస్ట్, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటుచేయాలనే వినతులు వస్తున్నాయి.



విశ్రాంతి తీసుకునేందుకు ఆకట్టుకునే బల్లలు



విద్యుద్దీపాలతో వాటర్ ఫౌంటెన్

### అందరికీ ఆహ్లాదమే లక్ష్యం



మధిర ట్యాంక్‌బండ్‌ను రూ.5.70 కోట్ల నిధులతో సుందరీకరించాం. పిల్లలు, యువత, మహిళలు అందరికీ ఆనందాన్ని కలిగించేలా బోటింగ్, విద్యుత్ దీపాలు, ఫౌంటెన్లు, ఓపెన్ జిమ్ ఏర్పాటుచేశాం. గతంలో మధిరలో పార్కులు లేకపోగా.. ఇప్పుడు ట్యాంక్‌బండ్ ఆ కొరతను తీర్చింది.

– మల్లాది వాసు, మున్సిపల్ కౌన్సిలర్, మధిర.

### మణిహారంగా ట్యాంక్ బండ్



గతంలో వాకింగ్‌కు ఎక్కడకు వెళ్లాలో తెలియకపోయేది. కానీ ఇప్పుడు ట్యాంక్‌బండ్‌పై అందమైన పూల మొక్కలు, ఆకట్టుకునేలా లైట్లతో ట్రాక్ అందుబాటులోకి వచ్చింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రతిరోజు సాయంత్రం స్నేహితులు, బంధువులతో కలిసి వాకింగ్‌కి వస్తున్నాం.

– జీటీఎంఎస్.రాణి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు.

### మనసు ప్రశాంతంగా ఉంటోంది



మధిర ట్యాంక్‌బండ్ కొత్త అందాలు సంతరించుకుంది. రంగురంగుల పూల చెట్లు, విద్యుత్ లైట్లు బాగున్నాయి. ఏ రోజైనా ట్యాంక్‌బండ్‌కు రాకపోతే ఏదో వెలితిగా అనిపిస్తోంది. కుటుంబ సభ్యులతో కలిసి ప్రతిరోజు రెండు గంటలపాటు గడుపుతున్నాం. మనసు ప్రశాంతంగా ఉంటోంది.

– వీరమాచినేని వైష్ణవి, గృహిణి

# నిప్పుల కొలిమి..



ఎండ వేడితో శనివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన జెడ్పీ సెంటర్ (ఇన్‌సెట్) ఎండ తీవ్రతకు స్కార్ఫ్ కట్టుకుని వెళ్తున్న యువతి

- జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతల నమోదు
- ఎండకు తోడు వడగాలులతో జిల్లా వాసుల సతమతం
- రోజురోజుకూ మరింత పెరగనున్న ఎండల ప్రభావం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. చాలాప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం.. ఈ ఏడాది గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి నుంచి రెండు డిగ్రీల మేర అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఏప్రిల్ నెలలోనే వేసవి తాపం ఇలా ఉంటే.. మే నెలలో వడగాలుల తీవ్రత ఎక్కువయ్యే అవకాశం ఉంది. జిల్లాలో యాసంగి పంటల సీజన్ ఇంకా ముగియని నేపథ్యాన రైతు, కూలీలు ఎండలతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

**ప్రారంభం నుంచే తీవ్రత**

జిల్లాలో ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు దంచి కొడుతున్నాయి. మార్చి మధ్యలో నుంచి మొదలైన ఎండలు ఈ నెల మరింత పెరిగాయి. కొన్ని రోజులు తుపాన్ ప్రభావంతో వర్షాలు కురిసినా వేసవి తీవ్రత మాత్రం అదే స్థాయిలో ఉంది. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదవుతుండటంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఉదయం 8గంటల నుంచే ఎండ మొదలై 11 గంటలకల్లా తీవ్రస్థాయికి చేరుతోంది.

**మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు**

వచ్చేనెలలో వేడి తీవ్రత మరింత ఉంటుందని పేర్కొంటున్న అధికారులు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఎండకు తోడు వాయువ్యం నుంచి వీచే వేడి గాలులతో ఇబ్బంది ఉంటుందని చెబుతున్నారు. వచ్చేనెలలో సగటున 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశముందని సమాచారం.

**పంటలపైనా ప్రభావం**

ఎండల తీవ్రత పంటలపై కూడా పడుతోంది. ఇప్పటి వరకు తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతినగా.. ప్రస్తుతం ఎండల తీవ్రత కారణంగా కొన్ని పంటలు దెబ్బతింటున్నాయి. యాసంగి సీజన్ పూర్తి కాకపోగా కొన్ని ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. అలాగే మొక్కజొన్న తదితర పంటలు కూడా ఇప్పుడిప్పుడే చేతికొస్తున్నాయి. ఈ క్రమంలో అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో ఇటు రైతులు, అటు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9గంటలకే భానుడు భగభగ మంటుండటంతో పనులు చేసేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు.

**40 డిగ్రీలకు పైగానే..**

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గత వారం రోజులుగా 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు అల్లాడుతున్నారు. శుక్రవారం 16 మండలాల్లోని 31 గ్రామాల్లో సగటున 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏన్కూరు మండలం తిమ్మారావుపేటలో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. శనివారం కొంత మబ్బు ఉండటంతో కొన్ని మండలాల్లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. అయినప్పటికీ తొమ్మిది మండలాల్లోని 12 గ్రామాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మంలోని ప్రకాష్‌నగర్‌లో అత్యధికంగా 42.2 డిగ్రీలకు చేరింది. ఎండను దృష్టిలో పెట్టుకుని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటకు వెళ్లవద్దని, వృద్ధులు, చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచిస్తున్నారు.

**జిల్లాలో శనివారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు**

| మండలం | ప్రాంతం | ఉష్ణోగ్రత |
|---|---|---|
| ఖమ్మం అర్బన్ | ప్రకాష్‌నగర్ | 42.2 |
| సత్తుపల్లి | సత్తుపల్లి | 41.7 |
| ముదిగొండ | పమ్మి | 41.5 |
| చింతకాని | చింతకాని | 41.2 |
| ఖమ్మం రూరల్ | పల్లెగూడెం | 41.1 |
| ఖమ్మం అర్బన్ | ఖానాపురం | 41 |
| మధిర | మధిర | 40.6 |
| పెనుబల్లి | పెనుబల్లి | 40.5 |
| నేలకొండపల్లి | నేలకొండపల్లి | 40.4 |

### రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిత్యకల్యాణ వేడుకలో 86 జంటలు పాల్గొని రూ.17,245 స్వామి వారికి కట్నాలుగా సమర్పించారు.

# ప్రజా చైతన్యమే సీపీఐ లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

- అమ్మకాల మోదీని సాగనంపుదాం
- ప్రజాపోరు యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

కారేపల్లి/ఏన్కూరు: ప్రజా చైతన్యమే లక్ష్యంగా, అమ్మకాల మోదీని సాగనంపడమే ధ్యేయంగా సీపీఐ కార్యాచరణ ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రజాపోరు యాత్ర శనివారం ఏన్కూరు, కారేపల్లి మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా కారేపల్లి మండలం చీమలపాడులో మండల మాజీ కార్యదర్శి బాగం నారాయణ స్థూపం వద్ద పార్టీ జెండాను ఎగురవేసి, నారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉసిరికాయలపల్లిలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మతతత్వ విధానాలను అనుసరిస్తూ కులమతాల మధ్య చిచ్చుపెడుతోందని ఆరోపించారు. దీనికి తోడు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. గ్యాస్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచిన మోడీ ప్రభుత్వం సామాన్యులపై మోయలేని భారాన్ని మోపిన నేపథ్యాన ఆయనను గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని కోరారు. అలాగే, రాష్ట్రంలో పోడు దారులకు అటవీ హక్కు పత్రాల జారీ, రుణమాఫీ, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయనిపక్షంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి సైతం ప్రజలు చరమగీతం పాడుతారని హెచ్చరించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యమని తెలిపారు. బీజేపీ హఠావో.. దేశ్‌కి బచావో నినాదంతో ప్రజా పోరుయాత్ర ద్వారా కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ప్రజలకు వివరించనున్నామని చెప్పారు. ఈ యాత్రలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు ఎర్ర బాబు, జాగర్లమూడి రంజిత్‌కుమార్, అమరనేని వీరభద్ర, తెప్పల సత్యం, మంకెన కృష్ణ, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రా బాబు, కొండపర్తి గోవిందరావు, ఏపూరి లతాదేవి, సిద్ధినేని కర్ణకుమార్, బోళ్ల రామస్వామి, నాయకులు ఉంగరాల సుధాకర్, ధన్‌రాజ్, చెరుకూరి నర్సయ్య, బాగం వెంకటేశ్వర్లు, నాగవెల్లి సుధాకర్, చింతల హనుమంతు, బొమ్మల కృష్ణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 'గోళ్లపాడు' ఆధునికీకరణతో మహర్దశ

- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- రజబ్ అలీ పార్క్, వీధి వ్యాపారుల సముదాయం ప్రారంభం



వీధివ్యాపారుల ప్రాంగణాన్ని ప్రారంభించిన మంత్రి పువ్వాడ, పక్కన మేయర్ నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంలో సుదీర్ఘ కాలంగా మురుగుతో పేరుకుపోయిన గోళ్లపాడు ఛానల్‌ను సమూలంగా అభివృద్ధి చేశామని .. ఆధునికీకరణ పనులు పూర్తికావడంతో త్రీటౌన్‌కు మహర్దశ వచ్చిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం 46వ డివిజన్ జూబ్లీపురలోని గోళ్లపాడు ఛానల్‌పై ఏర్పాటు చేసిన మహ్మద్ రజబ్ అలీ పార్క్, రూ.1.86 కోట్లతో నిర్మించిన వీధి వ్యాపారుల సముదాయంను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో కాల్వపై ఉన్న ఆక్రమణలను తొలగించి, అంతర్గాగంలో మురుగు, వర్షపు నీరు పారడానికి పైపులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా 10.6 కి.మీ. పొడవునా ఉన్న కాల్వ ఆక్రమణలు, సిల్ట్‌తో కుంచించుకుపోగా పూర్తిగా మార్చగలిగామన్నారు. కాల్వ పైభాగాన దాదాపు పది పార్కులు, క్రీడా ప్రాంగణాలు, బస్తీ దవాఖానాలు, పట్టణ ప్రకృతి వనాలు, వాకింగ్ ట్రాక్‌లు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.100 కోట్లు వెచ్చిస్తే రూ.200 కోట్లకు పైగా ఆస్తి ప్రజలకు దక్కిందని మంత్రి వివరించారు.

**ఐదేళ్ల క్రితం..**

సరిగ్గా ఐదేళ్ల క్రితం తన పుట్టినరోజు నాడు మోతేనగర్‌లో గోళ్లపాడు ఛానల్ ఆధునికీకరణ పనులు చేపట్టామని మంత్రి పువ్వాడ గుర్తు చేశారు. నిర్విరామంగా జరిగిన పనులతో అభివృద్ధి ఫలాలు ఇప్పుడు ప్రజల దరికి చేరాయని తెలిపారు. కలెక్టర్ గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులు సకాలంలో పూర్తి చేశారని మంత్రి అభినందించారు. ఖమ్మం త్రీ టౌన్‌లో మున్నేరుపై కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని, నగరాభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడేది లేదని స్పష్టం చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ చైర్‌పర్సన్ దోరెపల్లి శ్వేత, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి, బీజీ.క్లెమెంట్, ముక్కాల కమల, సరస్వతి, ఎల్లంపల్లి వెంకటేశ్వర్లు, చామకురి వెంకన్న, ఈఈలు రంజిత్, కృష్ణలాల్, డీఈ రంగారావు, మెప్మా డీఎంసీ సుజాత, నాయకులు మౌలానా, పగడాల నాగరాజు, గుండాల కృష్ణ, తోట రామారావు, మాటేటి నాగేశ్వరరావు, కన్నం ప్రసన్నకృష్ణ, రవి, కొత్తా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**అల్లా అందరినీ చల్లగా చూడాలి..**

అల్లా అందరినీ చల్లగా చూడాలని ప్రార్థించినట్లు రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. రంజాన్‌ను పురస్కరించుకొని నగరంలోని 23వ డివిజన్ ముస్తఫానగర్ మజీద్‌లో కార్పొరేటర్ షేక్ మక్బూల్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొని ప్రార్థన చేశాక మాట్లాడారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మస్జీద్ కమిటీ సదర్ అబ్దుల్ రహమాన్, సభ్యులు ఇబ్రహీం, ఇషాక్, ఇస్మాయిల్, సలీం, సత్తార్, మహ్మద్ అలీ, టీఆర్ఎస్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్‌తో పాటు ఆశ్రిఫ్, విజయ్, పగడాల నాగరాజు, ఇలియాజ్, సోహెల్, తాజుద్దీన్, నర్సింహారావు పాల్గొన్నారు.



ముస్లింలతో ఉపవాసం విరమింపచేస్తున్న మంత్రి

## క్లుప్తంగా

### దేవాలయ నిర్మాణానికి రూ.30,116 విరాళం


విరాళం అందజేస్తున్న చలమల్ల దంపతులు

**ఖమ్మంఅర్బన్:** నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల ఆలయ నిర్మాణం జరుగుతోంది. ఈమేరకు శనివారం ఉపాధ్యాయుడు చలమల్ల వెంకటేశ్వరరావు–రమాదేవి దంపతులు రూ.30,116 విరాళం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ చిత్రపటాలు 125..


అంబేద్కర్ చిత్రపటాలతో బాలకృష్ణ

**సత్తుపల్లి:** హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించగా.. సత్తుపల్లిలోని కళాకృతి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు బాలకృష్ణ 125 అంబేద్కర్ చిత్రాలను వివిధ వర్ణాలతో చిత్రించారు. సత్తుపల్లి పాత మున్సిపల్ కార్యాలయం సమీపాన కళాకృతి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఏర్పాటుచేసిన ఆయన శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతో కలిసి 125 అంబేద్కర్ చిత్రాలను సిద్ధం చేశారు. వీటిని పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలకు అందచేయనున్నట్లు బాలకృష్ణ తెలిపారు.

### టిప్పర్లను అడ్డుకుని నిరసన

**కొణిజర్ల:** నిత్యం పదుల సంఖ్యలో మట్టి టిప్పర్ల రాకపోకలతో దుమ్మధూళి విపరీతంగా వస్తుండగా తీవ్ర ఇబ్బంది పడుతున్నామని కొణిజర్ల వాసులు ఆరోపించారు. శనివారం పలువురు మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా ఖమ్మం అర్బన్ మండలం నుంచి టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు వచ్చివెళ్తుండటంతో కొణిజర్ల – ప్రొద్దుటూరు రోడ్డు ధ్వంసం కావడమే కాక విపరీతంగా దుమ్ము చేరి కొణిజర్ల బస్వాపురం క్రాస్ రోడ్డులోని దుకాణాదారులు, స్థానికులు అవస్థ పడుతున్నారు. దీంతో స్థానికులు అరగంట పాటు టిప్పర్లను అడ్డుకోగా, పోలీసులు, సర్పంచ్ సూరంపల్లి రామారావు చేరుకుని రోడ్డు కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారులకు తెలిపారు. దీంతో వారు ట్యాంకర్ పంపి నీరు చల్లించడమే కాక దుమ్ము లేవకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

### మట్టి ర్యాంప్‌ను పరిశీలించిన మైనింగ్ అధికారులు

**నేలకొండపల్లి:** మండలంలోని కోనాయిగూడెం సమీపాన మట్టి ర్యాంపును మైనింగ్ అధికారులు శనివారం పరిశీలించారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం అవసరమైన మట్టి సేకరణ కోసం తీసుకున్న అనుమతి ముగియటంతో మరోమారు పవర్ మెక్ కంపెనీ ప్రతినిధులు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అధికారులు శనివారం పరిశీలించి గతంలో అనుమతి మేరకు మట్టి తవ్వారా, లేదా అని కొలతలు వేశారు. ఈ సందర్భంగా మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణానికి మరో 10 వేల క్యూబిక్ మెట్రిక్ టన్నుల మట్టి అవసరం ఉందని దరఖాస్తు అందిందని తెలిపారు. సర్వేయర్ వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్ సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### టిప్పర్ ఢీకొని గాయాలు

**ఖమ్మంఅర్బన్:** నగరంలోని మధురానగర్ సమీపంలో పీఎస్ఆర్‌డూప్లెక్స్ కాలనీ వద్ద మట్టి టిప్పర్ ఢీకొని ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నగరంలోని పంపింగ్‌వెల్‌రోడ్డుకు చెందిన యువకుడు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడి కాళ్లు, తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. టిప్పర్ డ్రైవర్ వాహనం అక్కడే వదిలేసి పరారైనట్లు స్థానికులు తెలిపారు.

### 'నకిలీ' కేసులో కదలిక

**ఉద్యోగుల పాత్రపై విచారణకు కమిషనర్ నియామకం**

**ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలం తనగంపాడులో భూయజమానులు బతికి ఉండగానే మృతి చెందినట్లుగా ధృవీకరణ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నాక విక్రయించిన కేసులో మళ్లీ కదలిక మొదలైంది. ఈ కేసులో కొందరిని అప్పటికే అరెస్ట్ చేయగా.. సర్టిఫికెట్ల జారీ, రిజిస్ట్రేషన్‌లో అధికారుల పాత్ర తేల్చాలని కలెక్టర్ నిర్ణయించారు. డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తదితరుల పాత్రపై విచారణ కోసం ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభిని నియమించారు. ఇప్పటికే డీటీ కరుణశ్రీని ఇంకో మండలానికి బదిలీ చేశారు. రూ.కోట్ల విలువైన భూమిని నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తి అనంతరం మరొకరికి అమ్మగా, పోలీసులు పలువురిని అరెస్టు చేసినా కీలక వ్యక్తులను అదుపులోకి తీసుకోలేదనే విమర్శలు వచ్చాయి. ఇంతలోనే రెవెన్యూ అధికారుల పాత్రను తేల్చేందుకు కలెక్టర్ విచారణకు ఆదేశించడం విశేషం.

## మా గుడిసె కాలింది.. నేనెక్కడుండాలే?

- చీమలపాడులో రాములు కుమారుడు ప్రవీణ్ ఆవేదన
- వెలుగులోకి మరికొందరు క్షతగాత్రులు
- మూడు మూగజీవాల మృత్యువాత


అగ్నిప్రమాదం కారణంగా చీమలపాడులో కాలిపోయిన గుడిసె, (ఇన్‌సెట్) రాములు కుమారుడు ప్రవీణ్

**కారేపల్లి:** మండలంలోని చీమలపాడులో ఈనెల 12న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సందర్భంగా జరిగిన పేలుడులో నలుగురు మృతి చెందగా.. పలువురు తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్నారు. అయితే, ఘటన జరిగిన మూడు రోజులు దాటుతుండగా.. మరికొందరు క్షతగాత్రులు బయటకు వస్తున్నారు. ఈ ఘటనతో చీమలపాడుతో పాటు స్టేషన్ చీమలపాడు, గేటురేలకాయపల్లి, తవిసిబోడు, మూడ్‌తండా గ్రామాల వాసులకు కంటిమీద కునుకు కరువైంది.

**మా అయ్య నన్ను వదిలేసి వెళ్లిండు**

చీమలపాడులో బీఆర్ఎస్ కార్యకర్తలు పేల్చిన బాణసంచాతో నిప్పురవ్వలు పడి రాజన్నోళ్ల(జక్కుల) రాములుకు చెందిన గుడిసె కాలిపోయింది. ఈ గుడిసెలోని సిలిండర్ పేలడంతో నలుగురు మృతి చెందగా మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. అయితే, గుడిసె యజమాని రాములు గురువారం ఇక్కడకు వచ్చి చూసి వెళ్లిపోయాడు. వివిధ జాతరలు, పర్యాటక ప్రాంతాల్లో మూలికలు అమ్మే రాములు ఘటన వివరాలు తెలియగానే కుమారుడు ప్రవీణ్‌తో కలిసి ఇక్కడకు వచ్చిన ఆయన కుమారుడిని వదిలేసి వెళ్లిపోవడంతో బిక్కుబిక్కుమంటూ బంధువుల వద్ద గడుపుతున్నాడు. గుడిసె వద్దే తచ్చాడుతున్న ఆయన 'మా అయ్య నన్ను వదిలేసి వెళ్లిండు.. నేనెక్కడ ఉండాలే సారు' అంటూ దీనంగా కనిపించినవారినల్లా అడుగుతున్నాడు. ఏడాది క్రితమే తన తల్లి వీరమ్మ చనిపోయిందని చెప్పాడు. కాగా, చీమలపాడుకు శుక్రవారం వచ్చిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ప్రవీణ్ దీనస్థితిని గుర్తించి రూ.10వేలు ఇచ్చి బంధువులకు అప్పగించారు.

### ఆస్పత్రికి పోతే పట్టించుకోవట్లేదు..



గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో కుడి చేయికి గాయమైందని మూడ్ తండాకు చెందిన అజ్మీరా హరిబాబు తెలిపాడు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే ఏమి కాదులే అని చెప్పి పంపించారని తెలిపాడు. చేయి రోజురోజుకు వాపు వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

### నా కండ్లు కనబడ్తలేవు



మాణిక్యారం గుడితండా గ్రామానికి చెందిన తేజావత్ రాంబాబు సైతం ఆత్మీయ సమ్మేళనానికి వచ్చాడు. గుడిసె కాలిపోతుంటే ఆర్పే క్రమంలో సిలండర్ పేలిందని, ఈ క్రమంలో తాను కింద పడిపోయానని చెప్పాడు. అక్కడే ఉన్న బంధువులు ఆస్పత్రికి తీసుకెళ్తే కంటి పొరలు దెబ్బతిన్నాయని చెబుతూ కళ్ల జోడు ఇచ్చారని తెలిపాడు. వారం తర్వాత డాక్టర్లు మళ్లీ రావాలన్నారని.. ఇప్పుడు కళ్లు సరిగ్గా కనబడడం లేదని వాపోయాడు.

### ● పాడైపోయిన అన్నం తిని ఆవులు మృతి

చీమలపాడులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా సిలిండర్ పేలుడుతో ఎక్కడి వారక్కడ చెల్లాచెదురయ్యారు. అయితే, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, సర్పంచ్ మాలోతు కిషోర్ ఆధ్వర్యాన అప్పటికే సుమారు వేయి మందికి సరిపడా భోజనాలు సిద్ధం చేశారు. కానీ ఎవరూ భోజనం చేయకపోవడంతో మిగిలిపోయిన పదార్థాలన్నీ వాగు సమీపంలోని ఓ గుంతలో వేశారు. ఆపై పూడ్చకపోవడంతో విపరీతమైన ఎండలతో ఆ అన్నం, కూరలు పాడైపోగా చీమలపాడు, బాజుమల్లాయిగూడెంకు చెందిన రైతులు భూక్యా రవి, అజ్మీరా బిచ్చు, బుగ్గ చంద్రయ్య, పాయం లక్ష్మీనర్సుకు చెందిన ఆవులు శుక్రవారం అటుగా మేతకు వెళ్లిన సమయాన అన్నం తిన్నాయి. తిరిగి ఇంటికి వచ్చాక రాత్రి వేళ అస్వస్థతకు గురైన మూగజీవాల్లో భూక్యా రవి, అజ్మీరా బిచ్చు, బుగ్గ చంద్రయ్యకు ఆవులు శనివారం మృతి చెందగా, పాయం లక్ష్మీనర్సుకు చెందిన ఆవు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకెళ్లగా ఒక్కో ఆవుకు రూ.15వేల చొప్పున చెల్లిస్తామని చెప్పినట్లు సమాచారం.



## స్వస్థలానికి చేరని వలస కూలీ మృతదేహం

- గ్రామ పెద్దల హెచ్చరికతో హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు
- విషాదంగా ముగిసిన చీమలపాడు మృతుడి ఉదంతం


సందీప్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య మమీన్, కొడుకు కృష్ణ, తల్లిదండ్రులు

చీమలపాడులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా సిలిండర్ పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మహారాష్ట్రకు చెందిన వలస కూలీ చిందివారి సందీప్(36) శుక్రవారం రాత్రి మృతి చెందిన విషయం విదితమే. ఆయన స్వస్థలానికి చెందిన పెద్దల హెచ్చరికతో మృతదేహాన్ని అక్కడకు తీసుకెళ్లకుండానే హైదరాబాద్‌లోనే శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. చీమలపాడు ఘటనలో సందీప్ రెండు కాళ్లు కోల్పోగా హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ఆయనకు ఇక్కడ బంధువులెవరూ లేకపోవడంతో ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య మమీన్, కొడుకు కృష్ణ కూడా వెళ్లారు. సమాచారం అందుకున్న మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా సిందేలు తాలుకా మింగరికి చెందిన తల్లిదండ్రులు కూడా హైదరాబాద్ వచ్చారు. శనివారం ఉదయం కారేపల్లి ఎస్సై పి.రామారావు అక్కడకు వెళ్లి పర్యవేక్షించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని స్వస్థలానికి తరలించేందుకు వాహనం సమకూర్చగా కొద్దిదూరం వెళ్లగానే సందీప్ స్వస్థలంలోని గ్రామ తెగ పెద్దల నుంచి ఆయన తల్లిదండ్రులకు ఫోన్ వచ్చింది. సహజ సిద్ధమైన మరణం కాకుండా ప్రకృతి విపత్తులు, ప్రమాదాల్లో ఇతర చోట్ల మృతి చెందిన వారిని తీసుకొస్తే అందరికీ అరిష్టమని.. అదే జరిగితే కుటుంబాన్ని బహిష్కరిస్తామని హెచ్చరించారు. దీంతో చేసేదేం లేక విషయాన్ని వారు ఎస్సై రామారావు దృష్టికి తీసుకొచ్చారు. చీమలపాడు తీసుకెళ్దామని ఆయన చెప్పగా.. సందీప్ తల్లిదండ్రులు అంత దూరం రాలేమని అనడంతో హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు పూర్తిచేయించారు. అనంతరం సందీప్ తల్లిదండ్రులు మహారాష్ట్ర వెళ్లిపోగా, మృతుడి భార్య మమీన్, కుమారుడు కృష్ణను ఎస్ఐ రామారావు చీమలపాడుకు చేర్చి సర్పంచ్, గ్రామ పెద్దలకు పోషణ బాధ్యతలు అప్పగించారు.

### ● మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు చెల్లించాలి

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా జరిగిన ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించడమే కాక కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మండలంంలోని చీమలపాడులో అజ్మీరా మంగూ కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించి మాట్లాడారు. సీపీఐ నాయకులు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, యర్ర బాబు, మౌలానా, బోళ్ల రామస్వామి, ఉంగరాల సుధాకర్, ధన్‌రాజ్, చెరకూరి నర్సయ్య, బాగం వెంకటేశ్వర్లు, కరుణాకర్ పాల్గొన్నారు.

### ఆకట్టుకుంటున్న 'వేగ' ఆభరణాల ప్రదర్శన


'వేగ జ్యూయెలరీ ప్రదర్శనలో మేయర్ నీరజ, నిర్వాహకులు తదితరులు

**ఖమ్మంగాంధీచౌక్:** హైదరాబాద్, విజయవాడల్లో నిర్వహిస్తున్న 'వేగ' జ్యూయలర్స్ షోరూం బాధ్యులు ఖమ్మం వైరారోడ్డులోని గ్రాండ్ గాయత్రిలో ఆభరణాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శన శనివారం ప్రారంభం కాగా, రానున్న అక్షయ తృతీయ, వివాహాల సీజన్ సందర్భంగా జిల్లా వాసులకు స్వచ్ఛమైన ఆభరణాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని నిర్వాహకులు నవీన్, సుధాకర్ తెలిపారు. కాగా, ఆభరణాల ప్రదర్శనను శనివారం మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా సరికొత్త డిజైన్లతో ప్రదర్శన ఏర్పాటుచేసిన నిర్వాహకులను మేయర్ అభినందించారు. ప్రత్యేక ఆఫర్‌గా ప్రతీ రూ.2 లక్షల కొనుగోలుపై ఒక గ్రాము గోల్డ్ కాయిన్‌ను ఉచితంగా అందిస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు.

### నేడు మంత్రి పువ్వాడ పర్యటన

**ఖమ్మంమయూరిసెంటర్:** రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం నగరంలోని 37, 39, 40, 42వ డివిజన్లలో ముస్లింలకు ప్రభుత్వం తరపున తోఫా పంపిణీ చేయనున్నారు. ఆతర్వాత ఉదయం 10.30 గంటలకు మొగిలి పాపిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారు. సాయంత్రం వేణుగోపాల్ నగర్‌లో ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేశాక, శుక్రవారిపేట మజీద్‌లో ఇఫ్తార్ విందుకు మంత్రి పువ్వాడ హాజరవుతారు.



## రాజ్యాంగంతో అందరికీ రక్షణ

**జిల్లా జడ్జి శ్రీనివాసరావు**



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

**ఖమ్మంలీగల్:** భారత రాజ్యాంగం దేశానికి సర్వోత్కృష్ట చట్టమని.. రాజ్యంగం ద్వారా అందరికీ రక్షణ లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. ఖమ్మంలోని మానేరు లా కాలేజీలో శనివారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన 'భారత రాజ్యాంగం' అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్మాణం ఎలా ఉండాలి, పరిపాలన ఎలా సాగాలనే విషయాలను రాజ్యాంగం నిర్దేశించిందని చెప్పారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల అధికారాలు, బాధ్యతలను వివరించారని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రాథమిక హక్కులు, విధులపై పౌరులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సమాజాన్ని పీడిస్తున్న భ్రూణహత్యలు, వరకట్నం వంటి సాంఘిక దురాచారాలను రూపుమాపేలా కృషి చేయాలని తెలిపారు. న్యాయ సేవా సంస్థ కార్యదర్శి మహమ్మద్ జావీద్ పాషా, తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావుతో పాటు యూనస్ సుల్తాన్, స్వామి రమేష్, పాపారావు, శర్మ, ఇమ్మడి లక్ష్మీనారాయణ, సింగం జనార్దన్, మోహన్‌రావు, రత్నాంబ, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### కారు ఢీకొని వ్యక్తి మృతి

**సత్తుపల్లిరూరల్:** రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో మృతి చెందాడు. సత్తుపల్లి మండలం గంగారం ప్రకాష్‌నగర్‌కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ప్రకాష్‌నగర్‌కాలనీకి చెందిన కోటమర్తి అప్పారావు (58) శుక్రవారం అర్ధరాత్రి రోడ్డు దాటుతుండగా సత్తుపల్లి వైపు నుంచి దమ్మపేట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా, మృతుడి సోదరుడు జవహర్‌లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి పోలీసులు తెలిపారు. కాగా, అప్పారావు మృతదేహం వద్ద డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ తదితరులు శనివారం నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి..


హరీశ్ (ఫైల్)

**కొణిజర్ల:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథన ప్రకారం.. మండలంలోని పల్లిపాడుకు చెందిన ఎనగంటి హరీశ్ (33) వెల్డింగ్ దుకాణంలో పనిచేస్తుంటాడు. శుక్రవారం రాత్రి 9 గంటలకు ద్విచక్రవాహనంపై పల్లిపాడు నుంచి కొణిజర్ల వైపు వస్తుండగా కొణిజర్ల సమీపాన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. హరీశ్‌కు భార్య అనూష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## షోకాజ్ నోటీసుల జారీ అప్రజాస్వామికం


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న స్టీరింగ్ కమిటీ బాధ్యులు

**ఖమ్మంసహకారనగర్:** ఎస్సెస్సీ మూల్యాంకనం విధులకు హాజరుకాని తెలుగు, హిందీ, ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరికాదని యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. శనివారం డీఈఓ సోమశేఖరశర్మకు వినతిపత్రం అందజేశారు. స్పాట్ విధులు కేటాయించడంలో పొరపాట్లు జరిగాయని, దీనికి తోడు ఉత్తర్వులు అందని వారికి కూడా నోటీసులు జారీ చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. ఇకనైనా నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు పారుపల్లి నాగేశ్వరరావు, విజయ్, బుర్రి వెంకన్న, ఎస్.వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌నాయక్, నాగులీమీరా తదితరులు పాల్గొన్నారు. కాగా, పీఆర్‌టీయూ బాధ్యులు కూడా నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీఈఓ శర్మకు వినతిపత్రం అందజేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోతుకూరి మధు, ఆర్.రంగారావుతో పాటు యలమద్ది వెంకటేశ్వర్లు, సైదయ్య, విజయ్ అమృత్‌కుమార్, కట్టా శేఖర్ పాల్గొన్నారు.

**మూల్యాంకన బకాయిలు చెల్లించాలి**

గతేడాది పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ బకాయిలు చెల్లించడమే కాక విధులకు హాజరు కాని ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ముత్తయ్య, వెంకటేశ్వరరావు, నాగులీమీరా, వీరన్న తదితరులు డీఈఓకు వినతి పత్రం అందజేశారు.

### వడదెబ్బతో పశువుల కాపరి..


గోపాల్ (ఫైల్)

**రఘునాథపాలెం:** మండలంలోని కామంచికల్‌కు చెందిన పశువుల కాపరి అంతోటి గోపాల్(62) వడదెబ్బ బారిన పడి మృతి చెందాడు. రోజు మాదిరిగానే శుక్రవారం పశువులను మేతకు తీసుకెళ్లిన ఆయన సాయంత్రం తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రాత్రంతా వెతకగా గ్రామ సమీపంలోని ఏటి పక్కన ఆయన మృతదేహం కనిపించింది. ఎండ కారణంగా వడదెబ్బతో గోపాల్ మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**అక్కడికక్కడే ఇద్దరు మృతి**

**ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్ వద్ద ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. ముదిగొండ మండలం వల్లాపురానికి చెందిన చల్లా నాగేశ్వరరావు (62), నేలకొండపల్లి మండలం అనాసాగరానికి చెందిన పాల్వాయి రమేశ్ (56) ధాన్యం, అపరాలు కొనుగోలు వ్యాపారం చేస్తుంటారు. శనివారం తల్లంపాడులో మొక్కజొన్నలు కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలోని పొన్నేకల్ వద్దకు రాగానే కొత్తగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఎదురుగా అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు నాగేశ్వరరావు కుమారుడు చల్లా నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

### మహిళపై కత్తితో దాడి

**మధిర:** మధిరలోని దళిత కాలనీకి చెందిన మహిళను అదే కాలనీకి చెందిన సిమ్మసత్తి నాగమల్లేశ్వరరావు కత్తితో పొడిచి గాయపరిచాడు. కాలనీకి చెందిన బుల్ల ఏసోబు, శ్రీదేవి దంపతులు కూలి పనులకు వెళ్తుండగా, ఇంటి పక్కన అద్దెకు ఉండే నాగమల్లేశ్వరరావుకు, ఏసోబు కుటుంబానికి గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యాన శనివారం శ్రీదేవిని నాగమల్లేశ్వరరావు కత్తితో పొడిచి పరారు కాగా, బాధితురాలికి మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

# రామోజీరావు ఓ విషసర్పం

## చంద్రబాబు కరపత్రం.. ఈనాడు

- అక్రమాలకు వజ్రాయుధం.. ఈ పత్రిక
- మార్గదర్శిలో రూ.వేల కోట్ల డిపాజిట్లు మళ్లించిన మాట వాస్తవమే..
- డిపాజిటర్ల భవిష్యత్తు కోసం ప్రభుత్వం మార్గదర్శిపై విచారణ చేయడం మంచి పని
- ఎన్టీఆర్‌ని చాలా వేధించారు.
- చంద్రబాబు ఏడ్వడానికి.. రామోజీ మంచంపై పడుకోవడానికి కారణం అదే
- చేసిన పాపాలు తిరిగి తగులుతాయని రామోజీ, బాబును చూస్తే తెలుస్తోంది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో రామోజీరావు తోడల్లుడు, డాల్ఫిన్ అప్పారావు సంచలన వ్యాఖ్యలు



సాక్షి, విశాఖపట్నం: రామోజీరావు ఓ విషసర్పమని ఆయన తోడల్లుడు డాల్ఫిన్ అప్పారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈనాడును అడ్డుపెట్టుకుని రాయలసీమ, ఉత్తరాంధ్రలపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా అమరావతిలో కొన్ని భూముల కోసం విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. ఈనాడు పత్రిక చంద్రబాబు కరపత్రికగా మారిపోయిందన్నారు. గతంలో ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసినట్టే ఇప్పుడు సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజల గుండెల్లో కొలువైన వైఎస్ జగన్‌ను కూడా గద్దె దించాలని కుట్రలు చేస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల కేసులో సీఐడీ అధికారులు ఏ–1గా ఉన్న రామోజీరావును, ఏ–2గా శైలజా కిరణ్‌ను విచారిస్తున్న నేపథ్యంలో సంస్థలో లోపాలు, నిధుల మళ్లింపులను మార్గదర్శిలో చాలా కీలకంగా వ్యవహరించిన రామోజీరావు తోడల్లుడు డాల్ఫిన్ అప్పారావు వివరించారు. ఈ మేరకు 'సాక్షి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

**ఈగో ఫీలింగ్‌తో ఈనాడు ప్రారంభమైంది..**

ఒకసారి కేఎల్ఎన్ ప్రసాద్‌తో రామోజీరావు మాట్లాడుతున్న సమయంలో మాటామాటా పెరిగింది. పేపర్ ప్రారంభించడమంటే సులభం కాదన్న మాటలతో రామోజీలో ఈగో ఫీలింగ్ తలెత్తింది. ఎందుకు సులభం కాదో చూద్దామని మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నారు. 1974 ఆగస్టు 10న ఫౌండర్ ఎండీగా నేను వ్యవహరిస్తూ ఈనాడు ప్రారంభించాం. నంబర్‌వన్ పేపర్‌గా వచ్చేంత వరకూ నేను కృషి చేశాను.

**రామోజీ దీన్ని ఓర్వలేకపోయారు..**

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చిన్నగా ప్రారంభమైంది. ఆ తర్వాత రామోజీకి బ్రాంచ్‌లు విస్తరించాలన్న ఆలోచన వచ్చింది. విజయవాడ వచ్చినప్పుడు నన్ను పిలిచి మార్గదర్శి చిట్‌ఫండ్స్ విస్తరిస్తామని చెప్పారు. విజయవాడలో మొదటి బ్రాంచ్ ఏర్పాటు పనుల్ని రెండు మూడు నెలల్లోనే ప్రారంభించాం. ఆ తర్వాత విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, నెల్లూరు సహా 8 బ్రాంచ్‌లను వెంటనే మొదలుపెట్టాం. క్రమంగా చిట్స్ పెరిగాయి. అప్పట్లో ఆ నగదును ఎటూ మళ్లించకపోవడంతో మార్గదర్శి బాగానే ఉంది. ఇంతలో ఈనాడు క్రమంగా విస్తరించి నంబర్‌వన్‌గా మారింది. ఆ తర్వాత డాల్ఫిన్ హోటల్‌పై దృష్టిసారించాం. ఆ బాధ్యతలు కూడా నేనే తీసుకొని.. అద్భుతంగా తీర్చిదిద్దాను. ఈనాడు, డాల్ఫిన్.. ఇలా అన్నింటిని లీజుకు తీసుకున్న స్థలాల్లోనే నడిపాం. అందుకే మాకు లీజు మాస్టర్లు అని పేరొచ్చింది. నన్ను చూసే ఆ స్థల యజమానులు లీజులకు ఇచ్చారు. దీన్ని కూడా రామోజీ ఓర్వలేకపోయారు. నేను ఎదిగిపోతాననే మోననే భయం రామోజీని వెంటాడింది.

**అప్పటికే రూ.వేల కోట్లు మళ్లించేశారు..**

ఒక స్థాయి వరకూ డిపాజిట్లు తీసుకునేంత వరకూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాగానే ఉంది. ఈ డిపాజిట్లను మొదట ఈనాడు, డాల్ఫిన్ విస్తరణకు తరలించాం. ఎక్కడా ఇబ్బంది కలగకుండా.. లాభాలు రాగానే తిరిగి మళ్లీ మార్గదర్శిలోకి మళ్లించేవాళ్లం. అయితే.. సుప్రీంకోర్టు నిబంధనలను కఠినతరం చేసింది. ఆ సమయంలో ఒక సుప్రీంకోర్టు జడ్జి అభిప్రాయాల్ని తీసుకున్నాం. దాని లూప్‌హోల్‌ని పసిగట్టిన రామోజీరావు మార్గదర్శి డిపాజిట్లను మళ్లించడం మళ్లీ మొదలు పెట్టారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) హెచ్చరించడంతో నిధుల మళ్లింపును నిలుపుదల చేశారు. అయితే అప్పటికే రూ.వేల కోట్లు మళ్లించేశారు. ఈనాడు అప్పటికే అగ్రస్థానానికి చేరుకోవడంతో ఎవరూ అడ్డు చెప్పలేకపోయారు. ఆ సమయంలో ఉండవల్లి అరుణ్ కుమార్ దీనిపై పోరాటం మొదలుపెట్టారు.

**వైఎస్సార్ చొరవతో కొంతమందికి చెల్లింపు**

2,600 మంది కష్టమర్ల సొమ్ముని వెంటనే కట్టాలని ఆర్‌బీఐ మార్గదర్శకాలు జారీ చేసింది. అప్పటికప్పుడు సొమ్ములు తిరిగి వెనక్కు తీసుకురాలేని తరుణంలో వివిధ అంతర్జాతీయ కంపెనీలతో రామోజీరావు చర్చలు జరిపారు. అయితే అంత పెద్దమొత్తం ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో రామోజీ.. చంద్రబాబుని సంప్రదించారు. ఆయన రిలయన్స్‌ని, నిమేష్ అంబానీ అనే బ్రోకర్‌ని పట్టుకున్నారు. రామోజీ సంస్థల షేర్లు ఒక్కోటి రూ.500గా ఉంటే రూ.5 వేలుగా చూపించి నిధులు తెచ్చారు. తద్వారా 2,600 మంది కష్టమర్లలో కొంతమందికి చెల్లించారు. అయితే ఎంతమందికి ఇచ్చామనే వివరాల్ని ఇప్పటికీ రామోజీ బయటపెట్టలేదు. పైగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని వాదిస్తుంటారు. అంత పెద్ద వ్యక్తిపైన ఫిర్యాదు చేస్తే.. తమ భవిష్యత్తు ఏమవుతుందనే భయంతోనే డిపాజిటర్లు వెనకడుగు వేశారు. అది కూడా ఆ రోజుల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అప్రమత్తమవ్వడంతోనే కొంతమందికి చెల్లించారు.

**లెక్కలన్నీ పక్కాగా ఉంటే భయమెందుకు?**

వచ్చిన చిట్స్ మొత్తాన్ని రామోజీ ఇష్టం వచ్చినట్లు మళ్లించేస్తుంటే.. భవిష్యత్తులో ఏ చిన్న పొరపాటు జరిగినా లక్షల మందికి ఎలా చెల్లించగలరు? ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొనాల్సిన అవసరం ఉంది. మార్గదర్శి డిపాజిటర్ల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకే ప్రభుత్వం మార్గదర్శిపై విచారణ ప్రారంభించడం చాలా మంచిపని. లెక్కలన్నీ పక్కాగా ఉన్నప్పుడు రికార్డులు ఇవ్వడానికి భయమెందుకు?

**మూడో వ్యక్తికి తెలియకుండా రామోజీ, శైలజ జాగ్రత్తపడ్డారు..**

మార్గదర్శిలో మేనేజర్లు అకౌంట్స్ చేయడం, రిజిస్టర్స్ నిర్వహించడం మొదలైనవన్నీ చేయాల్సి ఉంటుంది. కానీ.. వారందర్నీ రామోజీ డమ్మీలుగా చేసేశారు. ఏ బ్రాంచ్‌లో డబ్బులు వచ్చినా ప్రధాన కార్యాలయానికి పంపించాలనే హుకుం జారీ చేశారు. వివిధ జిల్లాల్లో వసూలైన చిట్స్ డబ్బులు మొత్తం ప్రధాన కార్యాలయంలోనే ఉంటాయి. ఏ జిల్లాలో ఎన్ని డిపాజిట్లు ఉన్నాయి.. ఎంత మొత్తం వస్తుంది.. అనేది ఎవరికీ తెలీదు. ఇందులో ఏం జరుగుతుందనేది మూడో వ్యక్తికి కూడా తెలియకుండా రామోజీ, శైలజ జాగ్రత్తపడ్డారు.

**రామోజీ భయపడ్డారు..**

మార్గదర్శిపై సీఐడీ దాడులతో రామోజీ భయపడ్డారు. అందుకే మంచం పట్టినట్లు కనిపించారు. దాని వల్ల ఎక్కువగా ప్రశ్నించరని అనుకున్నారు. కానీ.. అది వర్కవుట్ కాలేదు. ఆ ఫొటో (మంచంపై పడుకున్న రామోజీని సీఐడీ విచారిస్తున్న) చూశాక నాకే ఆశ్చర్యమనిపించింది. ఆ స్థితిని చూసినప్పుడు ఈ మధ్య చంద్రబాబు ఏడ్చిన విషయం గుర్తొచ్చింది. గతంలో ఆరోగ్యం కూడా బాగోలేని ఎన్టీఆర్‌ని చంద్రబాబు, రామోజీ కలిసి ఏడిపించారు. చాలా మానసిక వేదనకు గురిచేశారు. రామోజీ మంచంపై పడుకోవడానికి.. చంద్రబాబు ఏడవడానికి కారణం కూడా అదే. చేసిన పాపాలు మనకు తిరిగి తగులుతాయని వీళ్లని చూస్తే తెలుస్తుంది. సుమన్ ఉండి ఉంటే.. మార్గదర్శికి సంబంధించి అప్పుడే గొడవలు జరిగి ఉండేవేమో. ఎందుకంటే సుమన్‌కి ఈ తరహా మోసాలు అసలు నచ్చవు.

**అక్రమాలకు వజ్రాయుధంగా ఈనాడు..**

అన్యాయాలు జరిగినప్పుడు, అక్రమాలు జరిగినప్పుడు ఈనాడుని ఉపయోగిస్తే చాలా బాగుంటుంది. గతంలో అలానే ఉపయోగపడింది. కానీ.. రానురానూ ఈనాడుని స్వార్థానికి ఉపయోగించడం మొదలుపెట్టారు. ఇప్పటికే అదే పంథాని కొనసాగిస్తున్నారు. తమ అక్రమాలకు పత్రికని వజ్రాయుధంగా మార్చుకున్నారు. ఎన్టీఆర్ రాజకీయంలో అడుగులు వేస్తున్న సమయంలో.. ఈనాడు ఎంతో ఉపయోగపడింది. ఎన్టీఆర్ అసెంబ్లీ టికెట్లు ఇచ్చే విషయంలో ఈనాడు రిపోర్టర్ల ద్వారా అభ్యర్థుల పేర్లని ఎంపిక చేసి నేనే ఉత్తరాంధ్ర నుంచి 37 పేర్లు పంపించాను. దాన్నే ఎన్టీఆర్ పరిగణనలోకి తీసుకోవడం.. వారంతా విజయం సాధించడంతో నాపై ఆయనకు నమ్మకం కలిగింది. ఆ సమయంలో నాకు ఎంపీ టికెట్ ఇవ్వాలని భావించారు. ఆ పేర్ల జాబితాని రామోజీరావుకు ఎన్టీఆర్ వినిపించడంతో.. రామోజీ నన్ను ఫోన్ చేసి అడిగారు. నాకు తెలీదని చెప్పాను. ఎక్కడ రాజకీయాల్లో ఎదిగిపోతానో అనే భయంతో రాజకీయాల్లోకి వద్దని అడ్డుకున్నారు.

### టీడీపీకి కరపత్రంగా ఈనాడు మారిపోయింది

ప్రస్తుతం మార్గదర్శిలో జరిగిన అవకతవకలు బయటపడతాయన్న విషయాన్ని రామోజీ గ్రహించారు. వాటిని ప్రజల్లోకి వెళ్లకూడదని భావించారు. అందుకే... టీడీపీ నేతలు, తెలిసినవారితో పత్రికపై దాడి చేస్తున్నారంటూ మాట్లాడిస్తున్నారు. డిపాజిట్లు అంటే ఏమిటో, చిట్స్ అంటే ఏమిటో తెలియనివారు కూడా మీడియా ముందుకు వచ్చి ఈనాడుపై దాడి, మార్గదర్శిపై దాడి అని మాట్లాడుతున్నారు. ఈనాడు తెలుగుదేశం పార్టీకి కరపత్రంగా ఉంది. కాబట్టి.. వారు దీన్ని కప్పిపుచ్చాలని భావిస్తున్నారు. సుప్రీంకోర్టులో ఏం జరుగుతుందనేది చూడాలి. ఇది కరెక్టో, కాదో.. డిపాజిటర్లని విచారించాలి. ప్రతివాదుల్ని పిలవకుండా.. గతంలో కేసు కొట్టించేశారు. ఇప్పుడు మళ్లీ పోరాటం జరుగుతోంది. న్యాయం ఆలస్యమవ్వొచ్చు కానీ.. ధర్మం ఎప్పటికైనా గెలుస్తుంది. ఇప్పుడు మార్గదర్శికి ఈ పరిస్థితి వచ్చిందంటే దానికి రామోజీరావే ప్రధాన కారణం.

### రామోజీకి తానే చక్రవర్తిననే అహం పెరిగిపోయింది..

ఇదంతా.. తన సామ్రాజ్యం.. ఇందులో వేరెవరికీ చోటుండకూడదని రామోజీరావు ఎప్పుడూ భావిస్తుంటారు. దీనికి చంద్రబాబు సహకారం అందించారు. ఎన్టీఆర్‌ని పదవీచ్యుతుడిని చేశాక ఇద్దరూ ఒక్కటైపోయారు. అప్పటి నుంచి రామోజీకి తానే చక్రవర్తిననే అహం పెరిగిపోయింది. ఫిల్మ్‌సిటీని 1,000 నాగళ్లతో దున్నించేస్తానని కేసీఆర్ చెప్పడంతో.. ఆయనను మభ్యపెట్టేందుకు కేసీఆర్‌తో చర్చలు జరిపారు. ఓం సిటీ కడతానని ప్లాన్లు చూపించారు. ఇది ఫిల్మ్‌సిటీని మించిపోతుందని నమ్మించారు. దాన్ని మోదీకి కూడా చూపించారు. కానీ.. ఓం సిటీ ఏమైంది..? పేపర్లకే పరిమితమైంది.

# రామోజీ.. కీలక 'లేఖ'పై కిమ్మనరెందుకు?

## వివేకా హత్య కేసులో అసలు నిజాలు ఎందుకు రాయరు?

- అప్పుడే దానిని పోలీసులకు ఎందుకు ఇవ్వలేదని ఎప్పుడైనా రాశారా?
- తామొచ్చే వరకు దాచి పెట్టండని వివేకా అల్లుడు, అతని అన్న ఎందుకు చెప్పారు?
- కీలకమైన ఈ విషయంపై దర్యాప్తు సాగడం లేదని ఎందుకు చెప్పరు?
- వివేకా చనిపోయారని అందరికీ చెప్పింది వివేకా అల్లుడు, అతని అన్న కాదా?
- ఈ విషయాలన్నీ వదిలి దర్యాప్తును పక్కదోవ పట్టించేలా మీ రాతలేంటి?
- ఎవరిని తప్పించాలని.. ఎవరిని ఇరికించాలని ఈ రాతలు?

**ఫ్యాక్ట్ చెక్**

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా ఈనాడు రామోజీ కంకణం కట్టుకున్నారు. ఘటనా స్థలంలో దొరికిన అత్యంత కీలకమైనవిగా భావిస్తున్న లేఖ, సెల్‌ఫోన్‌ను వెంటనే ఎందుకు పోలీసులకు స్వాధీనం చేయలేదనే అంశాన్ని ఏనాడైనా రాశారా రామోజీ? ఈ కేసులో తొలి నుంచీ ప్రతి విషయంలో మీ వక్రీకరణ కనిపిస్తూనే ఉంది. ఎప్పుడు ఏ చిన్న విషయం తెలిసినా.. దానిని ప్రభుత్వానికి, ఎంపీ అవినాశ్‌రెడ్డికీ ముడిపెట్టి లేనిపోని విషయాలు కలిపి చెలరేగిపోతూ వండివార్చడమే మీరు పనిగా పెట్టుకోవడం నిజం కాదా? అసలు వివేకా కేసులో ఇంత గందరగోళానికి కారణం ఏమిటని ఏనాడైనా తొంగి చూశారా? వైఎస్ వివేకానందరెడ్డిపై తీవ్రంగా దాడి చేసిన ఆగంతకులు ఆయనతో బలవంతంగా ఓ లేఖ రాయించారు. తనను డ్రైవర్ ప్రసాద్ తీవ్రంగా గాయ పరచినట్టుగా ఆ లేఖలో వివేకా రాసినట్టుగా ఉంది. ఆ లేఖ ఆయన పీఏ కృష్ణారెడ్డి ఆ రోజే అంటే 2019 మార్చి 15న ఉదయమే గుర్తించారు. వివేకానందరెడ్డి మృతదేహాన్ని మొదటగా చూసింది ఆయనే. ఆ లేఖతో పాటు వివేకానందరెడ్డి సెల్‌ఫోన్‌ను కూడా ఆయన స్వాధీనం చేసుకున్నారు. వివేకానందరెడ్డి మరణించిన సమాచారాన్ని ఆయన భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివ ప్రకాశ్‌రెడ్డిలకు ఫోన్ చేసి చెప్పారు. వివేకానందరెడ్డి మృతదేహం ఫొటోలను కూడా వాట్సాప్ చేశారు. ఆ ఫొటోలు చూస్తే ఎవరికైనా అది హత్య అని సులువుగా తెలుస్తుంది. ఆ లేఖను తాము వచ్చే వరకు ఎవరికీ ఇవ్వొద్దని.. ఆ విషయం బయటకు చెప్పొద్దని వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి పీఏ కృష్ణారెడ్డితో చెప్పారు. దాంతో ఆ లేఖ విషయం ఆయన పోలీసులకుగానీ ఇతరులకుగానీ చెప్పనే లేదు. అనంతరం వివేకానందరెడ్డి పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి ఫోన్ చేసి చెప్పడంతో ఎంపీ అవినాశ్‌రెడ్డికి విషయం తెలిసింది. దాంతో ఎన్నికల ప్రచారానికని బయలు దేరిన ఆయన వెనుదిరిగి వివేకా నివాసానికి చేరుకున్నారు. అప్పుడు కూడా వివేకానందరెడ్డి రాసిన లేఖ విషయాన్ని పీఏ కృష్ణారెడ్డి ఎవరికీ చెప్పనే లేదు. ఆ లేఖ విషయం అప్పుడే చెప్పి ఉంటే వివేకానందరెడ్డిది హత్య అని వెంటనే తెలిసేది. ఈ విషయం కదా తొలుత తేలాల్సింది. అది తేలితే తర్వాత కథ వేరుగా ఉండేది. ఈ విషయాలపై దర్యాప్తు సాగాలని ఏనాడైనా ఈనాడు రాసిందా? అంటే మీ ఉద్దేశం అసలు దోషులను తప్పించి.. ఇంకెవరినో ఇరికించాలనేగా! ఆ దిశగా దర్యాప్తు సాగేలా.. దర్యాప్తు సంస్థను ప్రభావితం చేసేలా తప్పుడు కథనాలు వండివార్చుతున్నది అందుకేగదా..

**ఇది మీకు కనిపించలేదా?**

సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్ రెడ్డి ఆ రోజు అంటే 2019 మార్చి 15న మధ్యాహ్నం 12 – ఒంటి గంట మధ్య పులివెందులకు చేరుకున్నారు. అప్పుడు పీఏ కృష్ణారెడ్డి ఆ లేఖను వారికి అందించారు. వారు దానిని సాయంత్రం 5 గంటల వరకు వారి వద్దే ఉంచుకున్నారు. ఆ తర్వాత తిరిగి వాటిని కృష్ణారెడ్డి ద్వారా పోలీసులకు అందించారు. ఆ సెల్‌ఫోన్‌లోని మెసేజ్‌లు, ఇతర డాటాను డిలీట్ చేసి మరీ పోలీసులకు ఇచ్చినట్టు సమాచారం. సహజంగా ఆ లేఖ విషయాన్ని వెంటనే చెప్పకుండా గోప్యంగా ఉంచిన పీఏ కృష్ణారెడ్డిని తొలుతే ఎందుకు ప్రశ్నించలేదని, ఎవరి ఆదేశాల మేరకు ఆ లేఖ విషయాన్ని రహస్యంగా ఉంచారో ఎందుకు తెలుసుకోలేదని.. అందువల్లే ఈ కేసులో కీలకమైన చిక్కుముడి విడిపోవడం లేదని ఎందుకు మీ రాతల్లో కనిపించదు రామోజీ? విషయం అందరికీ తెలిశాక.. ఘటనా స్థలానికి చేరుకున్న వారిని లక్ష్యంగా చేసుకుని.. వారిని దోషులుగా చూపుతూ దుష్ప్రచారం చేయడం మీకే చెల్లింది. వివేకా హత్య జరిగిన రోజు ఎన్నికల ప్రచారానికి వెళ్లడానికి అవినాశ్ రెడ్డి ఇంటి వద్దకు వెళ్లానని ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆ రోజూ చెప్పారు. ఈ రోజూ అదే చెబుతున్నారు. ఓ పని కోసం ఎంపీ ఇంటికి వెళ్లానని మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శశికళ కూడా ఆరోజు, ఈ రోజు అదే చెబుతోంది. ఎంపీ ఇంటి వద్ద ఉన్నామని వాళ్లే స్వయంగా చెబుతున్నప్పుడు.. ఆ విషయం కొత్తగా కనిపెట్టినట్లు మీరు చెప్పడం ఏమిటో!

**ఉదయ్‌ను పోలీస్ కస్టడీకి ఇవ్వండి**

వివేకా హత్య కేసులో అరెస్టయిన గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్ సీబీఐ కోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారణ జరిగే అవకాశం ఉంది.

---


## గని కార్మికులకు సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రెస్క్యూ సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీఎం కార్యాలయంలో శనివారం గని కార్మికులకు సీపీఆర్‌పై రెస్క్యూ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరియా సేఫ్టీ ఆఫీసర్ కోటిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల వయసుతో ప్రమేయం లేకుండా పలువురు గుండె పోటు బారిన పడి మృతి చెందుతున్నారని తెలిపారు. అయితే, తక్షణమే సీపీఆర్ చేయగలిగితే వారు బతికే అవకాశముంటుందన్నారు. ఈ నేపథ్యాన కార్మికులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మైన్స్ రెస్క్యూ స్టేషన్ ఇన్‌చార్జ్‌లు అనంతరామయ్య, మధుబాబుతో పాటు బి.మాధవ్, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

## రామయ్యను దర్శించుకున్న ఏపీ హైకోర్టు జడ్జి



ఆలయంలో జడ్జి శ్యాంసుందర్, కుటుంబీకులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని ఏపీ హైకోర్టుకు చెందిన న్యాయమూర్తి ఎస్.శ్యాంసుందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలకగా, ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆతర్వాత పండితులు వేదాశీర్వచనం చేయడంతో పాటు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 25 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఖమ్మంసహకారనగర్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 25 నుంచి నిర్వహిస్తున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. ఇంటర్ పరీక్షల కోసం ఆరు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా, 1,278 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. అలాగే, పదో తరగతి పరీక్షలకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 817 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు.

**జిల్లా వార్తలు**

# మేం ఆడించేదే ఆట..



పరుగుపందెం పోటీలో పాల్గొన్న క్రీడాకారులు (ఫైల్)

- ఒక్కో క్రీడాంశానికి రెండేసి సంఘాలు
- ఎవరి తరఫున ఆడాలో తేల్చుకోలేక క్రీడాకారుల సతమతం
- కొన్నింటికి గుర్తింపు లేకుండా యథేచ్ఛగా కార్యకలాపాలు
- అయినా దృష్టి సారించని అధికారులు

ఖమ్మంస్పోర్ట్స్: ఇబ్బడిముబ్బడిగా క్రీడా సంఘాలు పుట్టుకొస్తుండటంతో ఏది అసలు, ఏది నకిలీ సంఘమో తేల్చుకోలేక క్రీడాకారులు కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతీ క్రీడాంశానికి సంబంధించి రెండు.. కొన్నిచోట్ల మూడు సంఘాలు ఉండటం గమనార్హం. సుదీర్ఘ కాలం నుంచి ఉన్న క్రీడా సంఘం తరఫున ఆడితే అందే సర్టిఫికెట్లు తమకు భవిష్యత్‌లో ఉపయోగపడతాయని క్రీడాకారులు భావిస్తారు. కానీ పలు సంఘాలు ఉండడంతో ఏ సంఘం తరఫున ప్రాతినిధ్యం వహిస్తే సర్టిఫికెట్ వస్తుందో, రాదో తెలియక.. వచ్చినా ఉపయోగముంటుందా అనే మీమాంస వారిని వెంటాడుతోంది. ఇటీవల ఒక క్రీడా సంఘం తరఫున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు చేదు అనుభవం ఎదురైంది. సంబంధిత సంఘం తరఫున వెళ్లిన వారికి అందిన సర్టిఫికెట్లు చెల్లవని తేలడంతో నివ్వెరపోయారు. ఇకనైనా శాట్స్ బాధ్యులతో పాటు క్రీడా, యువజన శాఖ అధికారులు స్పందించి క్రీడాసంఘాల ముసుగులో మోసాలకు పాల్పడుతున్న వారి ఆటలకు అడ్డుకట్ట వేయడమే కాక తమకు న్యాయం చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

**సరికొత్త క్రీడాంశాలతో సంఘాలు**

విభిన్న రకాల క్రీడల పేర్లతో నూతన సంఘాలు పుట్టుకొస్తున్నాయి. వీటి నిబంధనలు పాత క్రీడలను పోలి ఉంటాయి. అనంతరం నేరుగా రాష్ట్రస్థాయిలో ఎంపికలు, జాతీయస్థాయిలో పోటీలు, ఆపై అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. ఇక అంతర్జాతీయ స్థాయి పోటీలు కేవలం నేపాల్, శ్రీలంక దేశాల్లో మాత్రమే జరుగుతుండటం.. నిర్వహణ, క్రీడాకారుల శిక్షణ, రవాణా పేరిట పలువురు ప్రజాప్రతినిధులను ఆశ్రయించి నిధులు సేకరిస్తున్నారు. తీరా టోర్నమెంట్‌కు వెళ్లి వచ్చాక తాము ఆడింది నకిలీ టోర్నీ అని తెలియడంతో క్రీడాకారులు నివ్వెరపోతున్నారు. ఔత్సాహిక క్రీడాకారులనే లక్ష్యంగా చేసుకుని పలువురు ఈ దందాకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

**'శాట్స్' దృష్టి సారించాలి..**

ఒక్కో క్రీడకు రెండేసి సంఘాలు, సరికొత్తగా పుట్టుకొస్తున్న క్రీడా సంఘాలపై తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) దృష్టి కేంద్రీకరించాలని క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు. ఒలింపిక్, క్రీడా సంఘాలతో కమిటీ వేసి తనిఖీలు చేయగలిగితే ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇకనైనా మరికొందరు ఔత్సాహిక క్రీడాకారులు నష్టపోకముందే శాట్స్ దృష్టి సారించాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి.

### ఫెడరేషన్‌లో గొడవలే కారణం

జాతీయస్థాయిలో ఏర్పడే క్రీడా సంఘానికి సంబంధించిన ఫెడరేషన్ బాధ్యులు రెండు వర్గాలుగా విడిపోవడంతో జాతీయస్థాయిలో రెండు క్రీడా సంఘాలు ఏర్పడుతున్నాయని తెలుస్తోంది. ఆయా సంఘాల బాధ్యులు తమ అధిపత్యం కొనసాగించేందుకు క్రీడాకారులను పావులుగా వాడుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎవరికి వారు తమకే గుర్తింపు ఉందని, భారత క్రీడా మంత్రిత్వ శాఖ అనుమతి లభించిందని చెప్పుకుంటున్నారు. ఇందులో కొన్ని సంఘాల బాధ్యులు కోర్టుకు వెళ్లామని, తమకే అనుకూలంగా అనుమతి లభించిందని చెప్పుకుంటున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా వీటిని నియంత్రించాల్సిన రాష్ట్ర, జిల్లా ఒలింపిక్ క్రీడా సంఘాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

## వేలంలో తలనీలాలకు రూ.24.60 లక్షలు



పెద్దమ్మ గుడి వద్ద వేలం నిర్వహిస్తున్న చైర్మన్ రామలింగం, ఈఓ రజినీకుమారి తదితరులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో వివిధ పనులు అప్పగించేందుకు శనివారం వేలం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి, ఈఓ రజినీకుమారి, పాలకమండలి చైర్మన్ మహిపతి రామలింగం సమక్షాన వేలం సాగింది. ఈ సందర్భంగా భక్తుల తలనీలాలు పోగుచేసుకునే హక్కు కోసం 12 మంది పాల్గొనగా, భద్రాచలానికి చెందిన చెందిన జె.శ్రీరామ్ రూ.24.60 లక్షలతో దక్కించుకున్నాడు. గత ఏడాది రూ.13.31 లక్షలు మాత్రమే పలకగా ఈసారి రూ.11.29 లక్షల ఆదాయం అదనంగా లభించింది. అలాగే, పాత సామగ్రి వేలం పాటలో పాల్వంచకు చెందిన మల్లేశ్‌నాయుడు రూ.32.500కు సొంతం చేసుకున్నాడు. కాగా, కొబ్బరికాయల దుకాణాలు, పూలదండల విక్రయం, ఫొటోలు తీయడం, టెంట్ సామగ్రి సరఫరా, చీరల కోసం టెండర్లకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ నెల 26వ తేదీకి వాయిదా వేశారు. ఇక కొబ్బరికాయల దుకాణాల అద్దె గడువు ఆదివారం ముగియనుండగా, వ్యాపారులు టెండర్లు వేయకపోవడంతో ఈఓ వారితో మాట్లాడారు. అద్దె పెరిగిన నేపథ్యాన తాము పాల్గొనలేదని వారు చెప్పడంతో.. మళ్లీ టెండర్ నిర్వహించే నాటికి అద్దె ఖరారు చేసేలా నిర్ణయించినట్లు ఈఓ తెలిపారు.

## పువ్వాడను పరామర్శించిన మంత్రి హరీశ్‌రావు



వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ జాతీయ నాయకులు, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తండ్రి పువ్వాడ నాగేశ్వరరావును శనివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. అస్వస్థతకు గురైన ఆయన రెండు వారాలుగా హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## మిమ్మల్ని దించడానికి అందరూ సిద్ధం



ముదిగొండ : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- బీఆర్ఎస్‌ను ఉద్దేశించి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ముదిగొండ, చింతకానిలో క్యాంపు ఆఫీస్‌ల ప్రారంభం

ముదిగొండ/చింతకాని: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని దించడానికి లక్షలాది మంది ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ముదిగొండ, చింతకానిలో ఏర్పాటుచేసిన క్యాంపు కార్యాలయాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు పలువురు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశాల్లో పొంగులేటి మాట్లాడుతూ తాను మాటల మనిషిని కాదని, అభిమానం ఉన్న వారంతా గూటికి చేరాలని కోరుతున్నట్లు తెలిపారు. అధికార అహంకారంతో ఉన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని చెప్పారు. ఎన్నికల వేళ హామీ ఇచ్చినట్లుగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రైతుల రుణ మాఫీ తదితర పథకాలేవీ సంపూర్ణంగా అమలు కాలేదని ఆరోపించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ తొలగించడమే కాక రైతుబంధు పథకంతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. పంట నష్టపోయిన రైతులకు సీఎం ప్రకటించిన రూ.10 వేలు పరిహారం ఇంకా అందలేదన్నారు. దళితబంధు పథకాన్ని హుజూరాబాద్‌తో పాటు రాష్ట్రంలో నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా, మిగతా నియోజకవర్గంలో 100 మందికి అమలుచేస్తామని చెప్పినా వంద శాతం ఇవ్వలేకపోయారని మండిపడ్డారు. ఇలాగే చేస్తూ వెళ్తే ఇంకా ఇరవై ఏళ్లు పడుతుందని స్పష్టం చేశారు. కాగా, తనకు పదవి ఉన్నా, లేకున్నా ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకున్నానని పొంగులేటి వెల్లడించారు. పార్లమెంట్ టికెట్ దగ్గర నుంచి తనను అనేక అవమానాలకు గురిచేశారని గుర్తుచేశారు. అయినప్పటికీ వెనుకడుగు వేయలేదని తెలిపారు. ఏదిఏమైనా ఉమ్మడి జిల్లా ప్రజల దీవెనలతో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అసెంబ్లీ గేటు తాకకుండా చేయడమే తమ లక్ష్యమని శ్రీనివాసరెడ్డి చెప్పారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు వాకదాని కన్నయ్య, జూలకంటి సంజీవరెడ్డి, వాక వెంకటేశ్వరరెడ్డి, ఏలూరి హనుమంతరావు, వట్టికూటి సైదులుగౌడ్, కందుల రంగారావు, అవులూరి వెంకటేశ్వరరెడ్డి, కోట రాంబాబు, మందడపు తిరుమల్‌రావు, తుళ్లూరి బ్రహ్మయ్య, ఉమ్మినేని కృష్ణ, భూక్యా సైదానాయక్, కిలారు జగన్మోహన్‌రావు, మనోహర్‌బాబు, నారపోగు వెంకటేశ్వర్లు, కన్నెబోయిన సీతారామయ్య, మందడపు శ్రీను, సారిక సైదులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే పొదుపు చేసుకోవాలి

**లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రాంరెడ్డి**



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డి

అశ్వారావుపేటరూరల్: విద్యార్థి దశలోనే నగదు పొదుపు చేసుకునేలా అలవాటు చేసుకోవాలని.. తద్వారా ఆర్థిక అక్షరాస్యత పెరుగుతుందని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రాంరెడ్డి తెలిపారు. అశ్వారావుపేట మండలం పెదవాగు ప్రాజెక్ట్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ పొదుపు చేసుకునే నగదును సురక్షితమైన పథకాల్లో జమ చేయాలన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియంత్రిత సంస్థలోనే డిపాజిట్ చేయడం, అప్పు తీసుకోవడం ద్వారా నష్టాలు ఎదురుకావన్నారు. అలాగే, ఆన్‌లైన్, సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులతో పాటు కౌన్సిలర్లు వి.అంజిబాబు, డి.చంటి, రావుల ముత్తు పాల్గొన్నారు.